ప్రజలే ప్రభువులు

# ప్రజారాజ్యం

సంపుటి : 1

సంచిక : 9

లోక్‌సత్తా 'ఇ' సమాచారపత్రం

మే 1 -15 , 2006

# సుపరిపాలనే రాజకీయానికి సరైన నిర్వచనం

## జిల్లాల పర్యటనలో డా॥ జయప్రకాష్ నారాయణ్

విద్య, వైద్యం ఉపాధిలాంటి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధిని సాధించగల సుపరిపాలనే రాజకీయానికి సరైన నిర్వచనం అని కొత్తరాజకీయం కోసం కృషి చేయాలంటూ లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. కడప, చిత్తూరు, నిజామాబాద్ జిల్లాలలో పర్యటించి పలు సభల్లో ప్రసంగించారు.

### చిత్తూరు జిల్లాలో

**తంబళ్లపల్లె :** రాజకీయాలు వ్యాపారంగా మారాయని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. తంబళ్లపల్లెలో 'రాజకీయం-సంస్కృతి' అన్న అంశంపై జరిగిన చర్చా గోష్టిలో మాట్లాడారు. గాంధీ, అంబేద్కర్ నిజమైన రాజకీయ పాలన అందించారని నేటి నాయకులు వ్యాపార దృష్టితో పాలిస్తున్నారన్నారు. రాష్ట్ర సమన్వయకర్త డి.వి.వి.ఎస్. వర్మ మాట్లాడుతూ మంచి సంస్కృతి గల రాజకీయాలు కొనసాగించాలంటే మంచి వ్యక్తులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా లోక్‌సత్తా నాయకులు మల్లికార్జున, శ్రీనివాసులు, సుధాకరరెడ్డి, లోకేష్, బాల కృష్ణారెడ్డి, హరికృష్ణ, దాస్, లలితమ్మ పాల్గొన్నారు.

**మదనపల్లె :** ప్రజలను దోచుకునే రాజకీయాలకు అడ్డుకట్ట వేసేందుకు నడుంబిగించాలని లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ యువతను కోరారు. మదనపల్లెలో లోక్‌సత్తా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు అధికారం కోసం ప్రజలకు డబ్బు ఎరచూపి అడ్డదారిలో పయనించడం మంచిదికాదన్నారు. సమావేశంలో రాష్ట్ర సమన్వయకర్త డి.వి.వి.యస్ వర్మ మున్సిపల్ ఛైర్మన్ ఎన్.రవికుమార్, లోక్‌సత్తా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు బి.వి.రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి శ్రీనివాసులు, శ్రీనివాసవర్మ, రెడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

**పీలేరు:** కండబలం ఉన్నవారు కోట్లు దండుకున్నంత కాలం దేశంలో సామాన్య జనానికి నష్టం తప్పదని లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. పీలేరులో జరిగిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. ఈ వ్యవస్థ మారాలంటే జనం నిలబడి అర్థం చేసుకుని సంఘటితం కావాలని, భుజం భుజం కలిపి గళం విప్పి, కదం తొక్కి రాజకీయ సంస్కృతికి తెర తీయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర సమన్వయకర్త డి.వి.వి.యస్. వర్మ, లోక్‌సత్తా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు బి.వి.రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, కార్యదర్శి శ్రీనివాసులు, శ్రీనివాసవర్మ, రెడ్డన్న, ఉపాధ్యక్షులు రామచంద్రకుమార్, పట్టణ మహిళా అధ్యక్షురాలు వెంకటశివలక్ష్మి, పెప్సి చలపతి, తదితరులు పాల్గొన్నారు.

**పలమనేరు :** సమాజంలో రాజకీయ హింస, నేరప్రాబల్యం పెరిగిపోతుందని లోక్‌సత్తా జాతీయసమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. పలమనేరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగించారు. లోక్‌సత్తా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు జయప్రకాష్ నారాయణ్ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్రసమన్వయకర్త డి.వి.వి.ఎస్. వర్మ, జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, ఎల్లయ్య, సత్యప్రకాష్, కుప్పరాజు, టి.జి. కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**కడప :** నిజమైన రాజకీయమంటే ప్రజలకు సేవచేయడమేనని లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ఏప్రిల్ 21న కడపలో నూతన రాజకీయ సంస్కృతి కోసం లోక్‌సత్తా ప్రజాఉద్యమ చైతన్య

సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. నేరచరితులు పెరిగి రాజకీయాలు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, ఉపాధిలాంటి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్దే రాజకీయానికి సరైన నిర్వచనమని ఆయన పేర్కొన్నారు. లోక్‌సత్తా రాష్ట్ర సమన్వయకర్త డి.వి.వి.యస్. వర్మ ప్రసంగిస్తూ ప్రజల అవసరాలను తీర్చే విధంగా నేటి రాజకీయాలు ఉండాలని, దానికోసం లోక్‌సత్తా కృషి చేస్తోందని తెలిపారు. ఈ సభలో రాష్ట్ర సమన్వయసంఘ సభ్యులు ఎల్. శ్రీనివాసులు, రాయలసీమ ప్రాంతీయ సమన్వయకర్త సి. ఎల్లయ్య, జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ ,కార్యదర్శి బాలాజీ, ఉపాధ్యక్షుడు డాక్టర్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**రాజంపేట:** రాజకీయాన్ని కండబలం,డబ్బు, కులం పట్టిపీడిస్తున్నాయని లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ విమర్శించారు. కడప జిల్లా రాజంపేట పాతబస్టాండ్ సెంటర్లో జరిగిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. ప్రతి రాజకీయ నాయకుడు కోటి రూపాయలను ఖర్చు చేసి పదికోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. యువకులు, మేధావులు, మహిళల్లో చైతన్యం వచ్చేంతవరకూ సమాజాన్ని బాగుచేయలేమని చెప్పారు. ఈ సభలో లోక్‌సత్తా నాయకులు డి.వి.వి.యస్ వర్మ, సి. ఎల్లయ్య, స్థానిక లోక్‌సత్తా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, పాపయ్య, ఉపాధ్యక్షుడు పి. సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లాలో జె.పి. పర్యటన

ఏప్రిల్ 23న లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త డా॥ జయ ప్రకాష్ నారాయణ్ నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. ఈ పర్యటన చిన్న చిన్న సమావేశాలతో నాలుగైదు చోట్ల జరిగింది. ఎల్లారెడ్డి, బాన్స్‌వాడ, రుద్రూరు, బోధన్, నిజామాబాద్‌లో జరిగిన ఈ పర్యటన ఆసాంతం లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు, జిల్లా లోక్‌సత్తా అధ్యక్షులు డి. వాసుదేవరావు, రాష్ట్ర ఎపెక్స్ సభ్యులు డా॥ వెంకట్‌రెడ్డి జిల్లా లోక్‌సత్తా కార్యవర్గ సభ్యులు కె. రమేష్‌బాబు, ఎమ్.ఏ. బేగ్ జిల్లా అసర్ కో-ఆర్డినేటర్ రామేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి ఎమ్.పి.పి కార్యాలయ ఆవరణలో జరిగిన ప్రజారాజ్యం సదస్సులో డా॥ జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రజల మౌళిక సౌకర్యాలు తీర్చేదే మంచి ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి జెడ్.పి.టి.సి శ్రీమతి లతాగౌడ్, ఎమ్.పి.పి. అధ్యక్షులుశ్రీమతి పర్వానా సుల్తానా, నాగిరెడ్డిపేట ఎమ్.పి.పి.శ్రీమతి డి. విమల, నాగిరెడ్డిపేట సర్పంచ్ శ్రీమతి సునీత తదితరులు పాల్గొన్నారు. జిల్లా లోక్‌సత్తా ఉపాధ్యక్షులు కె. శ్యామ్‌గోపాల్‌రావు, ఎల్లారెడ్డి లోక్‌సత్తా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్‌జోషి, రవీందర్‌రెడ్డి, కామారెడ్డిలో లోక్‌సత్తా అధ్యక్ష కార్యదర్శులు షెర్పని రాజేశం, రమణారావు, జిల్లా అసర్ కో-ఆర్డినేటర్ రామేశ్వర్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**బాన్స్‌వాడ :** బాన్స్‌వాడ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో అవినీతి నిర్మూలనలో యువత పాత్ర అనే అంశంపై డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని హన్మాజీపేట లోక్‌సత్తా నుండి సుమారు 25 మంది యువకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జె.పి ప్రసంగిస్తూ యువతరాన్ని అశ్రద్ధ చేస్తే ఆ దేశానికి భవిష్యత్ ఉండదన్నారు. ఈ కార్యక్రమాంలో బాన్స్‌వాడ మండల అధ్యక్ష కార్యదర్శులు బాపురెడ్డి, గంగాధర్, వర్ని మండల లోక్‌సత్తా అధ్యక్షులు నర్సారెడ్డి, స్థానిక పోలీస్ సబ్ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

**రుద్రూర్ :** రుద్రూర్ గ్రామంలో పంచాయతీ ప్రతినిధుల ఇష్టాగోష్టి కార్యక్రమంలో డా॥ జయప్రకాష్ నారాయణ్ పాల్గొన్నారు. గ్రామ పంచాయతీలే అభివృద్ధికేంద్రాలు కావాలని అప్పుడే గ్రామస్వరాజ్యం సాధ్యమని ఆయన అన్నారు. రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వాలకు నిధులు, విధులు, సిబ్బందిని బదలాయించినప్పుడే 73 వ రాజ్యాంగ సవరణకు సార్థకత లభిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో రుద్రూర్ గ్రామ సర్పంచ్, రాష్ట్ర మహిళా ప్రజాప్రతినిధుల సాధికారత సమాఖ్య కార్యదర్శి శ్రీమతి వసంత, ఉపసర్పంచ్ తోట్ల పెద్దగంగారాం, వర్ని మండల పరిషత్ ఉపాధ్యక్షులు కె. రాజారాం, వర్ని లోక్‌సత్తా అధ్యక్షులు నర్సారెడ్డి, యువజన కాంగ్రెస్ నేత సంజీవరెడ్డితదితరులు పాల్గొన్నారు.

**బోధన్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ప్రచురించిన నేత్రదానం చేయండని ప్రోత్సహించే పోస్టర్‌లను డా॥ జయప్రకాష్ నారాయణ్ స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో లయన్స్ జిల్లా వైస్ గవర్నర్ బసవేశ్వర్‌రావు స్థానిక లయన్స్ సభ్యులు, పోలీసు డిప్యూటి సూపరిండెంట్ మధుకర్‌బాబు, హస్తకళల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ అమర్‌నాథ్‌బాబు, మండల విద్యాధికారి బాలగంగాధర్, బోధన్ లోక్‌సత్తా అధ్యక్షులు జమీల అహ్మద్, జిల్లా అసర్ కో-ఆర్డినేటర్ రామేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు. ఆ తరువాత స్థానిక ఉర్దూ భవన్ సమావేశ మందిరంలో ప్రజారాజ్యం అనే అంశంపై బహిరంగ సభ జరిగింది.

# సూక్తులు

- విచక్షణాయుతంగా ప్రసంగించే వాడి కంటే గొప్ప వక్త లేదు -ఫ్రాన్సిస్ బేకన్
- ఒక గొప్ప లక్ష్యం కోసం చనిపోయిన వారే అమరులు -లార్డ్ బైరన్
- ఇతరులకంటే తెలివిగా వ్యవహరించు కానీ నేను తెలివి మంతున్ని అని మాత్రం అనొద్దు -చెస్టర్‌ఫీల్డ్
- చేయదగిన ప్రతి పనినీ చక్కగా చేయాల్సిందే -చెస్టర్‌ఫీల్డ్
- ఉత్కృష్టమైన ఆలోచనలున్నవారు ఎప్పుడూ ఒంటరి వారు కాదు -సర్ ఫిలిప్ సిడ్నీ
- తత్వవేత్తలు ప్రపంచాన్ని అర్థం చేసుకోడానికి ప్రయత్నించరు. కానీ అసలు జరగాల్సింది ప్రపంచాన్ని మార్చడం -కార్ల్‌మార్క్స్
- మీకు జీవితం మీద ప్రేమ ఉందా? నిజంగా ఉంటే కాలాన్ని వృధా చేయకండి -బెంజిమన్ ఫ్రాంక్లిన్
- మిత్రుల్ని కానీ శత్రువుల్ని కానీ సృష్టించేది మీ ప్రవర్తనే -చాణక్య
- ప్రతి ప్రభుత్వం యొక్క పునాదీ ఆదేశంలోని యువతీయవకులు విద్యే -లార్టిమస్ డియోజెన్స్
- స్వేచ్ఛ, న్యాయం తర్వాత ప్రాధాన్యం ఇవ్వాల్సింది విద్యకే. ఏంచేతనంటే, విద్య లేకపోతే స్వేచ్ఛా న్యాయం కొనసాగవు -జేమ్స్ గారీఫీల్డ్

# రాష్ట్రంలో ప్రారంభమైన ప్రజారాజ్య శిక్షణ

(నూతన రాజకీయ సంస్కృతి రాబోయే పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు లోక్‌సత్తా చేపట్టిన ప్రజారాజ్యం శిక్షణా కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైంది. ఇప్పటికి అందిన కొన్ని వార్తలను అందిస్తున్నాం)

### కోడేరు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు పశ్చిమగోదావరి జిల్లా కోడేరులో లోక్‌సత్తా ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. మొదటి రోజు శిక్షణ తరగతుల్లో రాష్ట్ర సమన్వయకర్త డి.వి.వి.ఎస్. వర్మ ప్రసంగించారు. రెండోరోజు శిక్షణలో జనబలం సంపాదకుడు డి. సోమసుందర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్ ఎస్. మనోరమ, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు గొట్టుముక్కల జానకి రామరాజు, ఆచంట మండలం లోక్‌సత్తా అధ్యక్షుడు చిలుకూరి సుబ్బారావు, ఆత్మీయ సేవాకేంద్రం కన్వీనర్ వెలిచేటి రామలింగయ్య, నెక్కంటి వేణుగోపాలకృష్ణ, చిలుకూరి సుబ్బారావు పాల్గొన్నారు. మాజీ సర్పంచ్‌లు, ఎం.పి.టి.సి.సభ్యులు, వార్డు సభ్యులు, పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు శిక్షణ పొందారు.

### ఉంగుటూరు

పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరులో జరిగిన అభ్యర్థుల శిక్షణ తరగతుల్లో జనబలం సంపాదకులు డి.సోమసుందర్, లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు గొట్టుముక్కల జానకిరామరాజు, జిల్లా కోఆర్డినేటర్ సాగిరాజు జానకిరామరాజు, లోక్‌సత్తా కార్యదర్శి పాంద్రాకుల శ్రీనివాసరావు, కోశాధికారి చీడే ప్రసాద్, కర్రి చంద్రశేఖర్, పలు గ్రామాల సర్పంచ్‌లు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### వినుకొండ

గుంటూరు జిల్లా వినుకొండలో అభ్యర్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహనరావు, జనబలం ఎడిటర్ డి.సోమసుందర్, శిక్షణ డైరక్టర్ ఎం. బసవపున్నారావు శిక్షణ ఇచ్చారు. ఐదు మండలాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజారాజ్యం శిక్షణ జిల్లా కన్వీనర్ జుజ్జూరి ఐరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారాజ్యం శిక్షణ : స్థానిక నేతలలో నూతనోత్తేజం

## వినుకొండ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అభ్యర్థుల మనోగతాలు

### అభ్యర్థులకు మంచి పట్టుగొమ్మ

ప్రజారాజ్యం శిక్షణ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు మంచి పట్టుగొమ్మ గా పనికి వస్తుంది. "శిక్షణ లో చెప్పిన అంశాలు చాలా బాగున్నాయి, అట్టడుగున వున్న ప్రజలందరి దగ్గరకు విషయాలను తీసుకువెళ్ళగలిగితే ప్రజల్లో తప్పనిసరిగా చైతన్యం వస్తుంది. "రాజకీయాల గురించి అభ్యర్థులంతా తెలుసుకోవాల్సిన మంచి విషయాలు వున్నాయి. శిక్షణ నాకు బాగా ఉపయోగపడింది. లోక్‌సత్తా సిద్ధాంతాలను ప్రచారం చేయడానికి నా శాయశక్తులా ప్రయత్నం చేస్తాను". - కాకానినర్సయ్య,ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనరు, వేల్పూరు

### ఆచరించడానికి అనువైనవి.

శిక్షణలో చెప్పిన అంశాలు నిజాయతీపరులందరూ ఆచరించడానికి అనువుగా వున్నాయి. ఎన్నికలకు ముందునుంచి ఈ విషయాలన్నీ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి. ప్రతి గ్రామంలో ప్రజారాజ్యం కోసం ఒక బృందాన్ని తయారు చేసి, అమలు చేయడానికి ప్రయత్నించాలి. మనం ఎంత సమర్ధంగా ప్రచారం చేస్తే అంత మంచి ఫలితాలు వస్తాయి.

- బి.వి. బ్రహ్మచారి, మెకానిక్, వేల్పూరు

### నిదానంగా పనిచేస్తాయి

శిక్షణలో చెప్పిన అంశాలు ప్రజలలో నిదానంగా పనిచేస్తాయి. ఇవి పనిచేయడం మొదలయితే ప్రజలకు మంచి

ఫలితాలు అందుతాయి. శిక్షణ ప్రతీ మండలంలో, ముఖ్యమైన గ్రామాల్లో ఏర్పాటు చేసి అభ్యర్థులను, ప్రజలను చైతన్యవంతుల్ని చెయ్యాలి.

- గాలి రాఘవయ్య,మాజీ సర్పంచ్,పోట్లూర్

## అభ్యర్థులకు ఉపయోగకరం

"ప్రజారాజ్యం శిక్షణలోని అంశాలన్నీ గ్రామ పంచాయతీ పరిధిలోనే వున్నాయి. అభ్యర్థులు పట్టుదలగా ఈ అంశాలను ప్రచారం చెయ్యాలి, ప్రజలు నిదానంగా తెలుసుకుంటారు". గ్రామానికి మంచి జరుగుతుందనే నమ్మకం ప్రజలకు కలిగితే వారు ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్ణయాలు తీసుకోగలరు.

- దాసరి చిట్టిబాబు,మతుకుమల్లి

## మంచి నాయకులు వస్తారు

గ్రామాలలో మంచి నాయకులు తయారయ్యేందుకు ప్రజారాజ్యం శిక్షణ పనికొస్తుంది. దీనివల్ల ప్రజల బతుకుల్లో మార్పులు వస్తాయన్న విషయాన్ని ప్రతి ఒక్కరికీ చెప్పాలి. ప్రజలు మన ప్రవర్తనను, మాటలను గమనిస్తూ వుంటారన్న సంగతి నాయకులు గుర్తుంచుకోవాలి. రానున్న కాలంలో లోక్‌సత్తా ద్వారా మంచి మార్పులు రాగలవని నా నమ్మకం.

- బి. నాగలక్ష్మి వేల్పూరు

## మంచి పాలన వస్తుంది

శిక్షణలోని అంశాలన్నిటినీ కచ్చితంగా అమలు చేస్తే గ్రామంలో నిజంగా మంచి మార్పులు వచ్చి, మంచి పాలన వస్తుంది. గ్రామాల గురించి బాగా అవగాహన చేసుకోడానికి శిక్షణ ఉపయోగపడింది. ప్రతీ సమస్యకు తప్పనిసరిగా పరిష్కారం వుంటుందని తెలుసుకోగలగాలి.

- ఎస్. బుజ్జమ్మ,వేల్పూరు

## ప్రచారమే సగం గెలుపు

ఇన్ని అంశాలను ప్రజలలోకి తీసుకు వెళ్ళడమే సగం గెలుపు. గ్రామానికి చెందిన సమస్యల గురించి మంచి అవగాహన కలిగింది. ప్రజలలో కూడా దీని గురించి బాగా చర్చ తీసుకు రావాలి. ప్రజారాజ్యం ఆలోచనలను ప్రచారం చేయడానికి కృషి చేస్తాను.

- స్వర్ణవెంకటేశ్వర్లు,శావల్యాపురం

## సురాజ్యం సాధించవచ్చు

ప్రజారాజ్యం భావాలను పూర్తిగా అమలు చేస్తే నిజంగానే గ్రామ "సురాజ్యం" సాధించవచ్చు. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి గురించి ఇంతవరకూ నాకున్న ఆలోచనలు వేరు. ప్రజారోగ్యం, విద్య, ఉపాధి లేకుండా అభివృద్ధి లేదని శిక్షణ ద్వారా తెలుసుకోలిగాను.

- జొన్నలగడ్డ నాగేశ్వరరావు,ఎలక్ట్రీషియన్ ,నాగిరెడ్డిపల్లి

## నమ్మకం కలిగింది

ధనం, కులం, కండబలం లేకుండా గెలవడం సాధ్యం కాదన్న భావన నాలో వుండిపోయింది. ఈ శిక్షణ పొందాక ఎటువంటి ప్రలోభాలు పెట్టకుండా గెలవచ్చునన్న నమ్మకం కలిగింది. లోక్‌సత్తా కార్యక్రమాలలో తిరుగుతున్నప్పటికీ సందేహాలు వుండేవి, ప్రజారాజ్యం ఆలోచన మంచి మార్గం చూపించింది. పంచాయితీ ఎన్నికలతో ప్రారంభమైన ఈ ఉద్యమం మరింతగా విస్తరించాలి.

- జి. ఐరామమూర్తి , గ్రామ సర్పంచ్ ,శావల్యాపురం

## ఇన్ని చేయచ్చా?

గ్రామ పంచాయతీ స్థాయిలో ఇన్ని మంచిపనులు చేయవచ్చన్న సంగతి శిక్షణ ద్వారా తెలుసుకోగలిగాను. కాగితాల్లో ఎంత మంచివి వున్నా అమలు జరగకపోతే ప్రజలకు మేలు జరగదు. అన్ని గ్రామాలలో ఈ విషయాల గురించి ప్రచారం జరగాలి.

- బి. శ్రీను నాయక్ ,హనుమాపురం

## అందుకే ఓడిపోయా

పాత రాజకీయ సంస్కృతి కారణంగానే గత పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోయాను. ప్రత్యర్థులు డబ్బు, సారా పంచారు. అయితే అనుభవం లేక వాటిని ఎదుర్కొనే శక్తి లేకపోయింది. ప్రజారాజ్యం శిక్షణవల్ల పాత రాజకీయ సంస్కృతిపై పోరాడటానికి బలం వచ్చింది. ప్రజలకు విషయాలు సరిగ్గా వివరిస్తే స్పందిస్తారన్న నమ్మకం ఉంది.

- పోట్లూరి వీరరాఘవులు,బొగ్గరం

## నిబద్ధత కావాలి

ఎంతమంచి సిద్ధాంతమైనా పాటించే వారిలో నిబద్ధత వుంటేనే అది విజయవంతమవుతుంది. ప్రజారాజ్యం కాన్సెప్ట్ సమగ్రంగా వుంది. కచ్చితంగా ఆచరణ సాధ్యమే. ప్రతిస్థాయిలో దీనిని అమలు చేయగలిగితే గ్రామాలలో నిజమైన అభివృద్ధిని చూడగలం. పన్నులకు సేవలకు, ఓటుకు జనహితానికి గల సంబంధాన్ని అర్థం చేసుకుంటే రాజకీయాలలో మార్పులు వస్తాయి. ప్రజారాజ్యం శిక్షణను విస్తృతంగా కొనసాగించాలి. నావంతు సహకారం అందిస్తాను.

- చెందూరి వెంకటేశ్వర్లు ,ఎం.పి.పి.,శావల్యాపురం

# సిత్రాల సింతకింద

-ధవళ సత్యం

పల్లవి : సిత్రాల సింతకింద
మంత్రాల మఱ్ఱికింద
దున్నపోతు ఈనితే
దూడను కట్టారంట

రాజకీయ తంత్రమంట
ఇది/ ఎన్నికల సిత్రమంట
జాగ్రర్త పడకపోతే
ఇలా / జరుగుతానే వుంటదంట ॥ సిత్రాల ॥

చరణ : ఆడమగ తేడాలు ఓటుహక్కు కుండవంట
అందరికి ఓటంట అదే ప్రజాస్వామ్యమంట
ఓట్లు రాసె అధికారులు ఇంటింటి కొత్తరంట
ఇంటి పేరు– అయ్యపేరు అడిగి రాసుకుంటరంట
పోలింగు రోజున ఓట్లు పట్టి సూసుకుంటే ॥2 ॥

ఊరి జనం వెయ్యుంటే ఓట్లు రెండు వేలుంటయ్ ఛల్
రెండువేల ఓట్లుంటే ఊరి జనం వెయ్యుంటరు

॥ రాజకీయ తంత్రమంట॥

చరణం : ఓటు లిస్టు తయారిలో పెద్ద తప్పులుండవంట!
అచ్చుతప్పులే గాని అసలు తప్పు దొర్లదంట
ఊరిడిసినోళ్ళ పేర్లు వరుసలోన వుంటయంట
సచ్చినోళ్ళ పేర్ల మీద ఓటు బతికి వుందునంట
దొంగఓట్లు ఏయకుండ గుర్తింపు కార్డులంట
పోలింగు బూతులో ఓటేయ మీరెళ్ళితే ॥ 2 ॥
గుర్తింపు కార్డుంటే – లిస్టులోన పేరుండదు – ఛల్
లిస్టులోన పేరుంటే – గుర్తింపు కార్డుండదు

॥ రాజకీయ ॥

చరణం : ఎన్నికలు రాగానే సిత్రాలు మొదలంట
ఏనాడు సూడనోళ్ళు మిమ్ముసూడవత్తరంట

గూడెం దారిబట్టి గుడిసె కాడకొత్తరంట
కులమతాలు లేవంటు కలగలిసిపోతరంట
మాటల్లో ప్రజాసేవ కడుపు నిండిపోతదంట
పోలింగు నాటికి ప్రచారాలు వేడెక్కి ॥ 2 ॥
ఆరతిత్తే వందంట – జై కొడితే మందంట – ఫుల్
ఆడోళ్ళకి చీరంట – ఓటేత్తే నోటంట ॥ రాజకీయ ॥

చరణం : ఓటు లిస్టు లోపాలు బయట పెట్టే లోక్‌సత్తా !
నేర చరిత చిట్టాలు ప్రకటించే లోక్‌సత్తా
ఓట్లు కొనే రాజకీయం ఒదలమంది లోక్‌సత్తా
ప్రజలే ప్రభువులు అని చాటింది లోక్‌సత్తా
ప్రజారాజ్య స్థాపనకై కదిలింది లోక్‌సత్తా
ఈ ఎన్నికల్లో లోక్‌సత్తా పిలుపు ఒక్కటే ॥ 2 ॥

పదవి చుట్టు తిరిగేటి రాజకీయమొద్దంది
ప్రజల చుట్టు తిరిగేటి రాజకీయం కోరింది ॥ 2 ॥

# జన జీవనంలో ప్రజాస్వామ్యం ఉండాలి
–బి.ఆర్. అంబేద్కర్

"మనం ఈ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సాంఘిక ప్రజాస్వామ్యంగా కూడా మలచాలి. సమాజం పునాదుల్లో సాంఘిక ప్రజాస్వామ్యం బలంగా ఉంటేనే పైన రాజకీయ ప్రజాస్వామ్యం మనగలుగుతుంది. సాంఘిక ప్రజాస్వామ్యం అంటే ఏమిటి? స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలు మూడింటినే మౌలిక జీవిత సూత్రాలుగా గుర్తించే జీవన విధానం. స్వేచ్ఛ లేకుండా సమానత్వం ఉండదు. సమానత్వం లేకుండా స్వేచ్ఛ ఒక్కటే ఉంటే అది కొద్దిమంది బలవంతులు - అసంఖ్యాకులైన బలహీనులపై ఆధిపత్యం చెలాయించటానికి దారితీస్తుంది. స్వేచ్ఛ లేకుండా సమానత్వం ఉంటే అది వ్యక్తిగత చొరవనూ, క్రియాశీలతనూ హరించివేస్తుంది. సౌభ్రాతృత్వం లేకుండా స్వేచ్ఛా సమానత్వాలు రెండూ చాలా అసహజంగా, కృతకంగా మిగిలిపోతాయి... ఇక్కడ మనం రెండు విషయాలను స్పష్టంగా అంగీకరించాలి. భారత సమాజంలో రెండు అంశాలు మచ్చుకు కూడా కనబడటం లేదన్న వాస్తవాన్ని మనం గుర్తించక తప్పదు. మొదటిది : సమానత్వం, రెండోది: సౌభ్రాతృత్వం. సౌభ్రాతృత్వం అంటే మనం భారత ప్రజల మందరమూ ఒకటేనన్న భావన. సోదర భావంతో అంతా కలిసి మెలిసి ఉండే తత్వం. మన సామాజిక జీవనంలో ఐక్యతనూ, సమూహతత్వాన్నీ, సంఘీభావాన్నీ తెచ్చిపెట్టేది ఇదే. దీనిని సాధించటం అంత తేలికేంకాదు... సౌభ్రాతృత్వం లేకుండా స్వేచ్ఛ, సమానత్వాలు రెండూ పైపై మెరుగులుగానే మిగిలిపోతాయి.

## తెలుసుకోదగ్గ సమాచారం

# పంచాయతీ ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించే ఉద్దేశంతో చేపట్టిన బిసి ఓటర్ల లెక్కింపు పూర్తయింది. రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించినట్టుగా మార్చి 29న ప్రారంభమైన బిసి ఓటర్ల గణన వివిధ దశల్లో జరిగింది. వీటిని ఏప్రిల్ 29న అన్ని పంచాయతీ కార్యాలయాల్లో ప్రచురించినట్టు అధికారులు చెప్పారు. బిసి ఓటర్ల లెక్క తేలడంతో జడ్పీ, మండల పరిషత్, పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియకు మార్గం సుగమం అయింది. అలాగే మొత్తం ఓటర్ల సంఖ్యపై కూడా స్పష్టత వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నిలకలకు ప్రభుత్వాన్ని సన్నద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 28 శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు పంచాయతీరాజ్ అధికారులతో సమావేశం జరిగింది.

## పంచాయతీ ఎన్నికలకు ముందు అధికారాల బదిలీ పాట

త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికారాల బదలాయింపు పాటను రాష్ట్ర ప్రభుత్వం ఆలాపించటం ప్రారంభించింది. కేంద్ర మంత్రి మణిశంకరయ్య దీనికి సంధానకర్త అయ్యారు. పంచాయతీలకు రాజ్యాంగం ప్రకారం 29 అంశాలను బదలాయించాల్సి వుండగా ప్రస్తుతానికి 10 అంశాలను బదలాయించడానికి రాష్ట్రప్రభుత్వం అంగీకరించినట్టు ప్రకటించారు. ఈ బదలాయింపు కూడా తక్షణమే అమలులోకి వచ్చేదిగా లేదు. ఈ పది అంశాలకు సంబంధించి గ్రామ పంచాయితీకి, మండల పరిషత్తులకు, జిల్లా పరిషత్తులకు ఈ ఏడాది ముగిసే సరికి పూర్తవుతుందని తెలియజేశారు. మిగతా 19 అంశాల మీదా ఎలాంటి నిర్దిష్టమైన గడువు కానీ, హామీ గాని ఆ ప్రకటనలో లేదు. ఏడాది తరువాత ఈ అంశాల బదిలీ ప్రకియ ప్రారంభమౌతుందని తెలియజేశారు. ఈసంవత్సరం బదిలీ చేస్తామని ప్రకటించినవి 1. వ్యవసాయం, విస్తరణ, 2. పశు సంవర్థకం, పాడి, కోళ్లు, మత్స్య పరిశ్రమ, 3. బలహీన వర్గాల సంక్షేమం, 4. ప్రాథమిక, పాఠశాల విద్య, వయోజన విద్య, 5. గ్రామీణ నీటి సరఫరా, 6. దారిద్ర్య నిర్మూలన, 7. మహిళా శిశు సంక్షేమం, 8. వైద్య ఆరోగ్యం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పారిశుద్ధ్యం, 9. కుటుంబ సంక్షేమం, 10. సాంఘిక సంక్షేమం

# పార్లమెంటులో వివిధ పార్టీల బలాబలాలు

| పార్టీల పేర్లు సంక్షిప్తంగా | పార్టీల పేర్లు | లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్ల శాతం 2004 | మొత్తం సీట్లు (లోక్‌సభ) | మహిళా ప్రతినిధుల సంఖ్య (లోక్‌సభ) | మొత్తం సీట్లు (రాజ్యసభ) | మహిళా సభ్యుల సంఖ్య (రాజ్యసభ) |
|---|---|---|---|---|---|---|
| ఐ.ఎన్.సి | భారత జాతీయ కాంగ్రెస్ | 26.53 | 145 | 12 | 72 | 10 |
| బి.జె.పి | భారతీయ జనతా పార్టీ | 22.16 | 138 | 10 | 49 | 5 |
| సి.పి.ఐ.(ఎమ్) | కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) | 5.66 | 43 | 5 | 14 | 2 |
| యస్.పి. | సమాజ్‌వాదీ పార్టీ | 4.32 | 36 | 3 | 12 | 1 |
| ఆర్.జె.డి | రాష్ట్రీయ జనతాదళ్ | 2.41 | 24 | 1 | 8 | 1 |
| బి.యస్.పి | బహుజన్ సమాజ్ పార్టీ | 5.33 | 19 | 1 | 6 | 1 |
| డి.ఎమ్.కె. | ద్రవిడ మున్నేట కజగమ్ | 1.81 | 16 | 3 | 2 | --- |
| ఎస్.హెచ్.ఎస్ | శివసేన | 1.81 | 12 | 2 | 4 | --- |
| బి.జె.డి | బిజూ జనతాదళ్ | 1.30 | 11 | 1 | 5 | 2 |
| సి.పి.ఐ | కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా | 1.41 | 10 | -- | 1 | --- |
| ఎన్.సి.పి | జాతీయ కాంగ్రెస్ పార్టీ | 1.80 | 9 | 2 | 4 | --- |
| జె.డి.(యు) | జనతాదళ్ (యూనైటెడ్) | 2.35 | 8 | --- | 1 | --- |
| ఎస్.ఏ.డి (బి) | శిరోమణి అకాలీదళ్ (బాదల్) | 0.90 | 8 | 1 | 2 | --- |
| పి.ఎమ్.కె | పట్టాలి మక్కల్ కచ్ఛీ | 0.56 | 6 | --- | 1 | --- |
| టి.డి.పి | తెలుగుదేశం పార్టీ | 3.04 | 5 | --- | 9 | 2 |
| టి.ఆర్.ఎస్ | తెలంగాణా రాష్ట్ర సమితి | 0.63 | 5 | --- | --- | --- |
| జె.ఎమ్.ఎమ్ | జార్ఖండ్ ముక్తి మోర్చ | 0.47 | 5 | --- | 1 | --- |
| ఎల్.జె.ఎన్.యస్.పి | లోక్ జనశక్తి పార్టీ | 0.71 | 4 | 1 | --- | --- |
| ఎమ్.డి.ఎమ్.కె | మురుమాలార్చి డి.ఎమ్.కె | 0.43 | 4 | --- | --- | --- |
| జె.డి.(ఎస్) | జనతాదళ్ (సెక్యూలర్) | 1.47 | 3 | --- | 1 | --- |
| ఆర్.ఎల్.డి | రాష్ట్రీయ లోక్‌దళ్ | 0.63 | 3 | 1 | --- | --- |
| ఆర్.ఎస్.పి. | రివెల్యూషనరీ సోషలిస్టు పార్టీ | 0.44 | 3 | --- | 3 | --- |
| ఎ.ఐ.ఎఫ్.బి | ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ | 0.35 | 3 | --- | 1 | --- |
| ఎ.ఐ.టి.సి | ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ | 2.07 | 2 | 1 | 1 | --- |
| ఎ.జి.పి | అస్సాం గణపరిషత్ | 0.53 | 2 | --- | --- | --- |
| జె.కె.ఎన్.సి | జమ్ము & కాశ్మీర్ జాతీయ కాన్ఫరెన్స్ | 0.13 | 2 | --- | 1 | --- |
| ఎమ్.యు.ఎల్ | ముస్లింలీగ్ | 0.20 | 1 | --- | 2 | --- |
| ఎ.ఎమ్.ఐ.ఎమ్ | ఆల్ ఇండియా మజ్లిస్ ఇ-ఎిట్టిహద్యూల్ ముస్లిమన్ | 0.11 | 1 | --- | --- | --- |
| కె.ఇ.సి | కేరళ కాంగ్రెస్ | 0.09 | 1 | --- | --- | --- |
| ఆర్.పి.ఐ (ఏ) | రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అత్‌వాల్) | 0.09 | 1 | --- | --- | --- |
| యస్.జె.పి.(ఆర్) | సమాజ్‌వాదీ జనతా పార్టీ (రాష్ట్రీయ) | 0.09 | 1 | --- | --- | --- |
| ఎన్.ఎల్.పి | జాతీయ లోక్‌తాంత్రిక్ పార్టీ | 0.09 | 1 | --- | 1 | --- |
| ఎన్.పి.ఎఫ్ | నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్ | 0.16 | 1 | --- | 1 | --- |
| జె.కె.పి.డి.ఎఫ్ | జె&కె పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ | 0.08 | 1 | 1 | 1 | --- |
| ఎమ్.ఎన్.ఎఫ్ | మిజో నేషనల్ ఫ్రంట్ | 0.05 | 1 | --- | 1 | --- |
| ఎస్.డి.ఎఫ్ | సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ | 0.04 | 1 | --- | 1 | --- |
| బి.ఎన్.పి | భారతీయ నవశక్తి పార్టీ | 0.18 | 1 | --- | --- | --- |
| ఐ.ఎఫ్.డి.పి | ఇండియన్ ఫెడరల్ డెమోక్రటిక్ పార్టీ | 0.08 | 1 | --- | --- | --- |
| ఎ.ఐ.ఎ.డి.ఎమ్.కె | ఆల్ ఇండియా డి.ఎమ్.కె | 2.19 | --- | --- | 12 | 1 |
| ఐ.ఎన్.ఎల్.డి | ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ | 0.50 | --- | --- | 4 | 1 |
| ఆర్.పి.ఐ. (జి) | రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా | 0.08 | --- | --- | 1 | --- |
| ఐ.ఎన్.డి | ఇండిపెండెంట్లు | 3.82 | 2 | --- | 11 | 2 |
| | ఇతర పార్టీలు | 2.90 | --- | --- | --- | --- |
| | మొత్తం | 100.00 | 543 | 45 | 244 | 28 |

# పంచాయితీలు - ప్రజారాజ్యం
## లోక్‌సత్తా స్థానిక నాయకత్వ శిక్షణా కార్యక్రమం

### శిక్షకులకు సూచనలు

(ఎ) పంచాయితీ ఎన్నికలలో పోటీ చేసే వారి కోసం ప్రజారాజ్యం శిక్షణ రూపొందించుకున్నాం. పోటీ చేసే అభ్యర్థులకు మనం కొన్ని కొత్త విషయాలను అందిస్తున్నాం. శిక్షకులు ముందుగా ఈ కొత్త అంశాలను బాగా అర్థం చేసుకోవాలి.

ఉదా : - ఇప్పటికే చాలా గ్రామాలలో మంచినీళ్ల ఏర్పాటు, మురికి కాల్వల ఏర్పాటు చెత్త కుండీలు, వగైరాలు ఉన్నాయి. కాని అవి ప్రజలకు నివాసయోగ్యమైన గ్రామాన్ని అందించడం లేదు. ఇప్పుడు మనం ఆ పని చేయించాలనుకుంటున్నాం.

- పాఠశాలలు, ఆరోగ్య ఉపకేంద్రం, రేషన్‌షాపు, అంగన్‌వాడీలున్నాయి. కాని అవి చదువు, ఆరోగ్యం, నిబంధనల మేరకు సేవలు అందించలేకపోతున్నాయి. ప్రజల సొమ్ముతో నడిచే ఈ సంస్థలు సేవలు ప్రజలు పొంది తీరాలి. ఆ పని చేయించడం ముఖ్యం
- ప్రభుత్వ పథకాలు అర్హులకి- అవినీతి లేకుండా దక్కడం లేదు. ఈ స్థితిని మార్చాలి.
- పంచాయితీలో సమావేశాల సక్రమ నిర్వహణ -సేవలు అందించడంలో జవాబుదారీతనం, ప్రజలకు సమాచారం, ప్రజల భాగస్వామ్యం సామాజిక న్యాయం కొరవడుతున్నాయి. వీటిని సాధించడం ముఖ్యం.
- వీరు ప్రస్తుత రాజకీయం లోని చెడ్డకు వారసులు కాకూడదు. కొత్త రాజకీయానికి నాంది పలకాలి. అందుకు తగిన నాయకత్వ బృందాన్ని వీరు అందించాలి.

(బి) ఇలాంటి కొత్త విషయాలను అభ్యర్థులకు అర్థమయ్యేలా వివరించడం ఎంత ప్రధానమో అభ్యర్థులు తమంతట తాము ఈ అంశాలను ప్రజలకు వివరించగలిగే వారుగా తయారుకావడం అంత ముఖ్యం. అందుచేత శిక్షకులు ప్రజారాజ్యం శిక్షణ'' పుస్తకంలో అంశాలకే పరిమితం కావాలి. తెలిసినదంతా చెప్పడానికి ప్రయత్నించకండి. తక్కువ విషయాలు అభ్యర్థులకు బాగా అర్థం అయ్యేలా ఒకటికి రెండుసార్లు పునశ్చరణ చేయించండి. అభ్యర్థులు మాట్లాడడానికి ఎక్కువ సమయం వెచ్చించాలి.. అందులో అన్ని విషయాలు జనరంజకంగా చెప్పించడానికి ప్రయత్నించండి.

(సి) చెయ్యగలిగిన పనులు నిర్దిష్టంగ చెప్పించాలి, చూస్తాం, ఆలోచిస్తా, లాంటి మాటలకు, శుష్కవాగ్దానాలను ప్రోత్సహించకండి.

మొత్తం మీద శిక్షకులు ఎంతబాగా చెప్పారన్న దానికంటే అభ్యర్థులు ఎంత బాగా చెప్పగలుగుతున్నారన్నది శిక్షణకు గీటురాయిగా వుంటుంది. దీనిని ఎల్లప్పుడు జ్ఞాపకం వుంచుకోవాలి.

## శిక్షకులు ఏం చెయ్యాలి

### మొదటి రోజు

(అభ్యర్థుల శిక్షణా కార్యక్రమానికి ఇద్దరు లేదా ముగ్గురు శిక్షకులు విధిగా హాజరు కావాలి. శిక్షకులు ముందుగా కూర్చుని ఎవరు ఏ పని చెయ్యాలో నిర్ణయించుకుని ఆ ప్రకారం కార్యక్రమం సాగించాలి.)

### ఉదయం 9 గం : అంశం 1 అభ్యర్థుల నమోదును పర్యవేక్షించాలి.

(ఎ) ఈ శిక్షణకు వస్తున్న అభ్యర్థుల దరఖాస్తు ఫారాలు, నమోదు పత్రాలను శిక్షకులు తమవెంట తీసుకువెళ్లాలి. వీటిని లోక్‌సత్తా జిల్లాశాఖ మీకు అందిస్తుంది.

(బి) ముందుగా దరఖాస్తు చెయ్యకుండా అప్పుడే వచ్చిన అభ్యర్థుల నుండి దరఖాస్తు ఫారాలు పూర్తి చేసి తీసుకోవాలి.

(సి) నమోదు పత్రంలో అభ్యర్థుల వివరాల నమోదుతో పాటు వారినుండి ఫీజు వసూలు చేయించాలి.

(డి) నమోదు పత్రాన్ని, హాజరైన వారందరి దరఖాస్తు ఫారాలను, ఫీజు మొత్తాన్ని మీరు తీసుకుని జిల్లా లోక్‌సత్తాకు అందించాలి. హాజరు కాని అభ్యర్థుల దరఖాస్తు ఫారాలను వేరుగా ఒక కవరులో పెట్టి ఇవ్వాలి.

ఈ బాధ్యత శిక్షకులలో ఒకరు తీసుకుని విధిగా నిర్వహించాలి. (జిల్లాశాఖ ఈ నమోదు పత్రాన్ని, శిక్షణలో పాల్గొన్న వారి దరఖాస్తు ఫారాలను రాష్ట్ర కేంద్రానికి పంపాలి.)

### ఉదయం : 10 గం॥: అంశం 2 పరిచయ కార్యక్రమం

(శిక్షకులలో ఒకరు దీనిని నిర్వహించాలి) ఒకరిని మరొకరు పరిచయం చేసే విధంగా వచ్చిన అభ్యర్థులను జంటలుగా రూపొందించాలి. పేరు, చదువు, వృత్తి, కుటుంబవివరాలు, చేస్తున్న కృషి వివరాలు క్లుప్తంగా తెలుసుకుని ఒకరినొకరు పరిచయం చేసుకోవాలి. ఈ వివరాలు తెలుసుకోడానికి అందరికీ 5 నిమిషాల సమయం ఇవ్వండి. జంట పరిచయానికి 1 నిముషం సమయం తీసుకోమని చెప్పాలి.

సభ్యుల సంఖ్య ఎక్కువగా వుంటే నేరుగా ఎవరి పరిచయాలు వారే చేసుకునే పద్ధతి పాటించండి. మొత్తంమీద పరిచయ కార్యక్రమానికి 45 నిముషాలు మించకూడదు.

### ఉదయం 10-45 : అంశం 3 శిక్షణాంశాల పరిచయం

(శిక్షకులలో ఒకరు దీనిని నిర్వహించాలి)

-లోక్‌సత్తా ఒక నూతన రాజకీయ సంస్కృతి కోసం కృషి చేస్తున్నది.

ఓట్లు కొనడం తిరిగి నోట్లు దండుకునే రాజకీయాన్ని వదిలించుకోవాలి.

రాజకీయం అధికార క్రీడ అయింది, వ్యాపారం అయింది, దానిని ప్రజాసేవచేసే సాధనం చెయ్యాలి. సమాజం హితం కోరే వ్యాసంగం చెయ్యాలి. ఈ పని గ్రామంలో ప్రారంభించి, రాష్ట్రానికి, దేశానికి విస్తరించాలి. అలాంటి కొత్తతరం రాజకీయనేతలను తీర్చి దిద్దడానికి ఈ శిక్షణ.

-పంచాయితీలలో సుపరిపాలన ఎలా అందించాలో వివరించడానికి ఈ శిక్షణ

-గ్రామాన్ని నివాసయోగ్యం చెయ్యడం ఎలా? అభివృద్ధికి కొత్త అర్థాన్ని చెప్పడానికి, పిల్లల చదువు, ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపర్చాలి, వివిధ పథకాలు ఎలా అమలు చెయ్యాలి, అన్న అవగాహన కోసం ఈ శిక్షణ.

మొత్తంమీద రాజకీయానికి, నాయకత్వానికి కొత్త అర్థాన్ని; పంచాయితీ పాలనకు కొత్త అర్థాన్ని; అభివృద్ధికి కొత్త అర్థాన్ని చెప్పడానికి ఈ శిక్షణ ఉద్దేశించబడింది.

### పాటించవలసిన నియమాలు:

-ఈ శిక్షణ మన కోసం, మన గ్రామాల కోసం మనం ఏర్పాటు చేసుకున్నాం. అందరూ సమయపాలన పాటించాలి. అందరూ మాట్లాడాలి. ఒకరినొకరు సహకరించుకుని శిక్షణ ప్రయోజనం పొందాలి.

పాటించవలసిన నియమాలు:

శిక్షణ పొందేవారు ఈ క్రింద పేర్కొన్న నియమాలు పాటించాలని కోరండి

-ఈ శిక్షణ మన కోసం, మన గ్రామాల కోసం మనం ఏర్పాటు చేసుకున్నాం. అందరూ సమయపాలన పాటించాలి. అందరూ మాట్లాడాలి. ఒకరినొకరు సహకరించుకుని శిక్షణ ప్రయోజనం పొందాలి.

- ఒకరు మాట్లాడేటప్పుడు వేరెవరు అడ్డుతగలకూడదు.

-వ్యక్తిగత విమర్శలకి, ఆరోపణలకి దిగకూడదు.

-శిక్షకులు ఒక అంశంపై వివరణ ఇవ్వడం పూర్తి చేసిన తరువాత మాత్రమే ఆ అంశంపై సందేహాలుంటే అడగాలి.

-శిక్షణకు సంబంధించని విషయాల గురించి, లోక్‌సత్తా సంస్థ గురించి ఏమైనా సందేహాలుంటే శిక్షకులను వ్యక్తిగతంగా కలిసి అడగాలి. అందరి సమయం వృధా చేయకూడదు.

## ఉదయం 11 గం॥ : అంశం 4 శిక్షణ ప్రారంభం - ప్రశ్న; వర్గీకరణ

శిక్షకులలో ఒకరు ఈ క్రింది ప్రశ్నతో శిక్షణను ప్రారంభించాలి.
"పంచాయితీ ఎన్నికలలో మీరు ఎందుకు పోటీ చెయ్యాలనుకుంటున్నారు?
మీరు గ్రామంలో ఏం సాధించాలనుకుంటున్నారు"?దీనికి అభ్యర్థులు ఒకటి రెండు మాటలలో సమాధానాలు చెప్పాలని కోరాలి. వారు చెప్పే మాటల్ని మరొక శిక్షకుడు బోర్డుమీదరాయాలి.
బోర్డుమీద రాసేటప్పుడు ఒక తరహా సమస్యల్ని ఒకచోట వచ్చేలా రాస్తే తర్వాత వర్గీకరణ తేలిక అవుతుంది.

ఉదాహరణకు

| 1 | 2 | 3 | 4 | 5 |
|---|---|---|---|---|
| తాగునీరు | పాఠశాల చదువు | వృద్ధాప్యపింఛను | అవినీతి లేకుండా పాలన | పార్కులు |
| మరుగుదొడ్లు | ఆరోగ్యం | ఉపాధి పథకం | సిటిజన్స్ ఛార్టర్లు | ఆటస్థలాలు |
| మురికి కాల్వలు | రేషన్‌షాపు | గృహకల్ప | సమాచార హక్కు | ఆడిటోరియం |
| చెత్తా చెదారం | అంగన్‌వాడీ | యువశక్తి | | |
| రోడ్లు - లైట్లు | | | | |

ఇలా బోర్డు మీద రాసిన తర్వాత వీటిని ఈ క్రింది విధంగా వర్గీకరించండి.

1. నివాస యోగ్యమైన గ్రామం
2. గ్రామంలో ప్రభుత్వ సంస్థలు - సేవలు
3. గ్రామంలో అమలయ్యే సంక్షేమ పథకాలు
4. పంచాయితీలో సుపరిపాలన
5. ఇతరములు

ఇందులోని అంశాలను తీసుకుని చర్చించుకుందాం అని చెప్పండి.

## గం॥ 11 - 15 ని॥ : అంశం 5 బృంద ప్రసంగం అంశాలు

(ఎ) నివాసయోగ్యమైన గ్రామం, (బి) గ్రామంలో ప్రభుత్వ సంస్థలు - సేవలు
శిక్షకుడు ఈ క్రింది అంశాలను వివరించాలి. ఈ అంశాలను అందరూ రాసుకోవాలని చెప్పండి

(ఎ) 1) ప్రస్తుతం మన గ్రామం నివాసయోగ్యంగా వుందా
అనారోగ్యం ఎలా వుంది - అపరిశుభ్రత ఎలా వుంది

దీనివల్ల గ్రామం అంతా ఎలా నష్ట పోతున్నది
దీనిని మనం మార్చడానికి ఏం చెయ్యాలి

2. పరీక్షించిన మంచినీరు
3. అందరికీ మరుగుదొడ్లు - బహిరంగ మలవిసర్జన లేకుండా చెయ్యడం
4. మురికి కాల్వలను శుభ్రం చేయించడం, మురికి గుంటలు లేకుండా చెయ్యడం
5. రోడ్లమీద చెత్తా చెదారం తొలగించడానికి ఏర్పాటు చెయ్యడం

పంచాయితీ సొమ్ము ముందుగా వీటికోసం ఖర్చు చెయ్యాలి
నూటికి 80% జబ్బుల్ని గ్రామాల నుండి తరిమెయ్యాలి.
ఇంకా నిధులుంటే రోడ్లు, కొత్తలైట్లు - పార్కులు
ఆటస్థలాలు, ఆడిటోరియంలు నిర్మించుకుందాం

(బి) ప్రభుత్వ సంస్థలు - సేవలు

1. గ్రామంలో ఉన్న ప్రభుత్వ సంస్థల్ని గుర్తించమని అడగండి
(పాఠశాల, ఆరోగ్యం ఉపకేంద్రం, అంగన్‌వాడీ, రేషన్‌షాపు వగైరా)
2. వీటిపట్ల మనం ఎలాంటి వైఖరి అనుసరించాలి? - సహకార వైఖరి తీసుకోవాలి
వీటికి అవసరమైన వసతుల కల్పనకు సహాయం చెయ్యాలి. పంచాయితీ అందుకు ముందుకు రావాలి.
3. ఈ సంస్థల్ని నిబంధనల మేరకు పని చేయించాలి
4. ప్రజల భాగస్వామ్యంతో సేవల మెరుగుదల
ఈ సంస్థలలో ప్రజల భాగస్వామ్యాన్ని క్రియాశీలం చెయ్యాలి.
విద్యకమిటీలు, తల్లుల కమిటీలూ ఆహార సలహాసంఘాలను పని చేయించాలి. వారిని ప్రత్యక్ష పాత్రధారుల్ని చేసి సేవల్ని మెరుగు పర్చాలి.
5. ఈ సంస్థలన్నీ ప్రజల సొమ్ముతో నడుస్తున్నాయి.
మన పిల్లల చదువు, ఆరోగ్యం, రేషనువంటి ముఖ్య సమస్యల్ని మనం పరిష్కరించుకోవాలి.
మెరుగైన సేవలు అందించి తీరాలి.

**11.45 : బృంద ప్రసంగాలు**

(అభ్యర్థులను 4,5 బృందాలుగా విభజించాలి. పైన పేర్కొన్న రెండు అంశాలను అభ్యర్థులు ప్రసంగం రూపంలో ప్రజలకు వివరించాలి.  ఈ రెండు అంశాలమీద ప్రతి ఒక్కరితో మాట్లాడించాలి)

**12.30 : అందరి సమావేశం**

ప్రతి బృందం నుండి ఒకరిద్దరిని  తిరిగి ప్రసంగించమని కోరాలి.
-అన్ని విషయాలు చెబుతున్నదీ లేనిదీ  చూడాలి
-ప్రజల జీవితానికి ముడివేసి చెప్పేలా చూడాలి
-గ్రామంలో సజీవ ఉదాహరణలు వుండేలా చూడాలి

**1.00 : భోజన విరామం**

**2.00 : అంశం 6 బృంద ప్రసంగంలోని అంశాలు (శిక్షకుల వివరణ)**

(సి) సంక్షేమ పథకాలు, (డి) పంచాయితీలలో సుపరిపాలన

1) అభ్యర్థులకు తెలిసిన సంక్షేమ పథకాల పేర్లు రాబట్టండి
యువశక్తి, గృహకల్ప, ఉపాధిహామీ, పెన్షన్లు వగైరాలు

2. పథకం రాగానే ప్రజలకు తెలియజెయ్యడం - చాటింపు / టముకు వేయించడం. పంచాయితీ ఆఫీసు దగ్గర నోటీసు బోర్డులో వివరాలు ప్రకటించడం.
3. లబ్ధిదారుల జాబితాల ప్రకటన
4. గ్రామసభలో అందరి సమక్షంలో ఎంపిక
5. అవినీతి లేకుండా అందించే ఏర్పాటు

(డి) పంచాయితీలలో సుపరిపాలన

1. సమావేశాలు : ఈ క్రింది విధంగా నిర్వహించాలి

ఎ) పంచాయితీ సమావేశాలు ఎజెండా నోటీసుతో, ఆఫీసులో ఏర్పాటు చేయడం.ఈ సమావేశాల్లో ప్రజలు ప్రేక్షకులుగా కూర్చునేందుకు గ్యాలరీ ఏర్పాటు

బి) గ్రామసభ - జమాఖర్చుల నివేదిక
చేపట్టబోయే పనుల వివరణ
లబ్ధిదారుల ఎంపిక
ప్రజల సూచనలు నమోదు చేసి పంచాయితీ సమావేశంలో చర్చించి నిర్ణయాలు చెయ్యడం

సి) పంచాయితీ పరిధిలో వివిధ లబ్ధిదారుల సంఘాలూ కార్యచరణ కమిటీల సమావేశాలు నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం.

2. సిటిజన్స్ ఛార్టర్ల అమలు
రోజు ఆలస్యానికి 10 రూపాయలు ఇచ్చే ఏర్పాటు
3. సమాచారం - పంచాయితీ ఆఫీసు దగ్గర బోర్డులు
పని జరిగే చోట వివరాలతో బోర్డులు
అడిగిన సమాచారం అందించే ఏర్పాటు చెయ్యాలి
4. పంచాయితీలో అవినీతి లేని పాలన అందించాలి
5. సామాజిక న్యాయం - దళితులు, మహిళలూ, బలహీనవర్గాల సామాజిక అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు
6. పెద్దలతో, అన్ని పార్టీల వారితో సలహాకమిటీ
7. పంచాయితీ ఆస్థుల నమోదు, పరిరక్షణ, అభివృద్ధికి చర్యలు

గం॥ 2-30 : బృంద ప్రసంగాలు

పై రెండు అంశాలపై అందరూ ప్రసంగించాలి

3.30 : అందరి సమావేశం

ప్రతి గ్రూపు నుండీ కొందరితో ప్రసంగాలు

**4.15 : అంశం : 7 నినాదాలు**

ఈ నాలుగు అంశాలపై ఎన్నికలలో వారు ప్రజలకు ఇచ్చే నినాదాలు రాయించండి

4.30 : నినాదాలు చదివించండి

బాగా వున్న వాటిని బోర్డు మీద రాయించండి

4.45 : అన్ని అంశాలపై శిక్షకుల పునశ్చరణ

ప్రతి అంశంలో కీలక సమస్యలను అభ్యర్థులతో చెప్పించండి

**5.00 : అంశం : 8 ఇంటికి ప్రశ్నలు**

వివిధ ప్రశ్నలకు 10 మందితో సమాధానాలు రాబట్టి ఏ ప్రశ్నకు ఎంతమంది అవును ఎంత మంది కాదు అన్నది రాసుకుని రమ్మని చెప్పండి.

## రెండవ రోజు

ఉదయం 9-30 ని॥ : మొదటి రోజు అంశాల పునశ్చరణ

### గం॥ 10.00 : అంశం 9 లోక్‌సత్తా పరిచయం (శిక్షకులలో ఒకరు దీనిని నిర్వహించాలి.)

**ప్రశ్న : లోక్‌సత్తా దేనికోసం పనిచేస్తుందని మీరు భావిస్తున్నారు ?**

**ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలను బోర్డు మీద రాయండి.**

వాటిని ఆధారం చేసుకుని ప్రజారాజ్యం పుస్తకంలో "లోక్‌సత్తా-సుపరిపాలన కోసం ఎగరేసిన జెండా" అనే శీర్షిక కింద ఇచ్చిన అంశాలు తప్పనిసరిగా వుండేలా లోక్‌సత్తాను పరిచయం చెయ్యండి.

1. లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్, 1997 ఆగష్టు 3న ఆవిర్భవించింది.
2. సుపరిపాలన కోసం మరో స్వతంత్ర పోరాటాన్ని నిర్వహిస్తున్నది. మొదటి స్వతంత్ర్య పోరాటం ద్వారా స్వపరిపాలన వచ్చింది. 58 సంవత్సరాలలో దేశం సాధించిన దానికన్నా ఎంతో సాధించడానికి వీలుంది. కాని పాలనా దారిద్ర్యమే మన అసలు దరిద్రం. దీన్ని తొలగించడానికి రెండో స్వతంత్ర్య పోరాటం. పాలనా దారిద్ర్యాన్ని తొలగించాలంటే ప్రస్తుత రాజకీయ సంస్కృతిని మార్చాలి. కొత్త రాజకీయ సంస్కృతిని సాధించాలి. అలాగే ఎన్నికల వ్యవస్థని, పాలనా వ్యవస్థల్ని సంస్కరించాలి.

### సుపరిపాలనకు లోక్‌సత్తా చేపట్టిన అంశాలు

3. సుపరిపాలన : కొత్త రాజకీయ సంస్కృతి, ఎన్నికల సంస్కరణలు
4. సుపరిపాలన : పారదర్శకత, జవాబుదారీతనం (సమాచార హక్కు, సిటిజన్స్ ఛార్టర్ల తరహా సంస్కరణలు)
5. సుపరిపాలన : పౌరులు కేంద్రంగా స్థానిక ప్రభుత్వాలు. ప్రజలు నివసించే చోట వారి సమస్యలు పరిష్కరించే ప్రభుత్వాలు వుండాలి.
6. సుపరిపాలన : సత్వర న్యాయం - స్థానిక కోర్టులు

లోక్‌సత్తా సాధించిన కొన్ని విజయాలను సంక్షిప్తంగా వివరించాలి

### 10-45 : అంశం 10 మంచి రాజకీయం - మంచి నాయకత్వం

**ప్రశ్న : ప్రస్తుత రాజకీయం లో కనిపిస్తున్న చెడు ఏమిటి?**

**ఈ ప్రశ్నకు అభ్యర్థుల నుండి వచ్చే సమాధానాలు బోర్డుమీద రాయండి**

**మంచి రాజకీయం అంటే :** అభ్యర్థులు ఇచ్చే సమాధానాలు ఆధారంగా ఈ కింది అంశాలను శిక్షకులలో ఒకరు వివరించాలి.

1. సమాజంలో వ్యక్తులు తమంతట తాము చేసుకోలేని పనులను చక్కబెట్టడానికి రాజకీయం పుట్టింది. (విద్య, ఆరోగ్యం, రోడ్లు - శాంతిభద్రతలు వగైరాలు)
2. సమాజంలోని అంతరాలను, వ్యత్యాసాలను అర్థం చేసుకుని వాటిని తొలగించడానికి, సమతూకమైన అభివృద్ధిని సాధించడానికి ఉద్దేశించింది రాజకీయం.
3. సమాజంలోని ఎప్పుడూ వనరులు పరిమితంగా వుంటాయి. ప్రజల ఆకాంక్షలు అపరిమితంగా వుంటాయి. వీటి మధ్య వున్న అగాధానికి వారధి నిర్మించేది రాజకీయం.
4. వ్యక్తి ఆకాంక్షలకీ, సమాజహితానికి మధ్య అనుసంధానం సాధించేది రాజకీయం.
5. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని, పన్నుల సొమ్మును తిరిగి వివిధ సేవలరూపంలో సమాజానికి అందించేది రాజకీయం.

అందుచేత రాజకీయం అంటే సమాజహితం కోసం చేసే పవిత్ర వ్యాసంగం. రాజకీయం అంటే అధికారక్రీడ కాదు. ప్రజాసేవకు

సాధనం. పదవి చుట్టూ తిరిగేది రాజకీయం కాదు. ప్రజలు చుట్టూ తిరిగేది రాజకీయం. ఈ నూతన సంస్కృతిని మనం సాధించాలి. ఓట్లు కొని పదవులు పొంది, నోట్లు దండుకునే ప్రస్తుత రాజకీయం వ్యాపార సంస్కృతిని వదిలించుకోవాలి. పంచాయితీలలో పోటీచేస్తున్న అభ్యర్థులు ప్రస్తుత నకిలీ రాజకీయానికి వారసులు కాకూడదు-కొత్త సంస్కృతికి మార్గ దర్శకులు కావాలి.

## మంచి నాయకత్వం

**ప్రశ్న : ప్రస్తుతం నాయకులుగా ఎలా ఎదుగుతున్నారు? ఎలా వ్యవహరిస్తున్నారు?**

**అభ్యర్థులు ఇచ్చే సమాధానాలను బోర్డు మీద రాయాలి.**

1. సహజ నాయకత్వం - సమూహం / సమాజంలోని అందరి ఆకాంక్షలను వాస్తవికంగా వ్యక్తీకరించేదిగా వుంటుంది. సమాజానికి / సమూహానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించి దానివైపు నడిపించే నాయకత్వాన్ని అందించాలి.
   లక్ష్యసాధనలో ఎదురయ్యే కష్టనష్టాలను ముందుండి భరించడానికి సిద్ధపడే నాయకత్వాన్ని అందించాలి.
2. సమాజానికి విశ్వాసపాత్రమైన నాయకత్వాన్ని అందించడానికి బృంద నాయకత్వం ఉత్తమమైంది. బృందంలో ఒకరు నిర్వహించే పాత్ర కూడా నాయకత్వపాత్రే. గ్రామాలలో అలాంటి బృందాన్ని రూపొందించి బృందనాయకత్వాన్ని రూపొందించుకుంటే లక్ష్యసాధన తేలిక అవుతుంది.
3. కలిసి పనిచెయ్యడం : బృందనాయకత్వం చెదిరిపోకుండా వుండాలంటే కలిసి పనిచేసే తత్వం తప్పనిసరి అవుతుంది. ఎదుటివారి అభిప్రాయాలను గౌరవించడం, ఏకాభిప్రాయ సాధనకు కృషి చెయ్యడం ద్వారా కలిసి పని చెయ్యడానికి తగిన ప్రయత్నాలు చేయడమే మంచి నాయకత్వ లక్షణం అవుతుంది.
4. **లక్ష్యం ప్రధానం కావాలి :** లక్ష్యం ప్రధానం అయినప్పుడు దాని సాధనకు చిన్న చిన్న అంశాలు అడ్డం రావు. లక్ష్యం ప్రధానం కాకపోతే అవే సమస్యలవుతాయి. లక్ష్యసాధనే ప్రధానం అయినప్పుడు ఏ పాత్రకు, ఏ సమయంలో ఎవరు అవసరం అయితే బృందంలో వారు ఆ పాత్ర పోషించగలుగుతారు.
   అందుచేత బృందాన్ని రూపొందించుకోండి సమాజంలోని అన్ని తరగతుల వారు అందులో ప్రాతినిథ్యం వుండేలా చూడండి- ఎన్నికలలో అవసరాన్ని బట్టి ఎవరు పోటీ చెయ్యవలసి వస్తే వారు పోటీచెయ్యడం అందరూ విజయానికి కృషి చేస్తే ఫలితాలు బాగుంటాయి.

**11-30 :** బృందాలు -ప్రసంగాలు

ఈ రెండు అంశాలపై అందరూ ప్రసంగించాలి.

**12-15 :** అందరి సమావేశం

బృందం నుండి ఒక్కొక్కరు ఈ అంశాలపై ప్రసంగం

## 12-45 : అంశం 11 : గెలవడానికి మంచి మార్గాలు

(శిక్షకులు ఇందులోని అంశాలపై వివరణ ఇవ్వాలి.)

1. ఎన్నికలు ప్రజల కోసం (ఇది ప్రజలలో ప్రచారం కోసం)
2. మార్పువల్ల ప్రయోజనం పొందేవారు ఏకం కావాలి (ఇది ప్రజలలో ప్రచారం కోసం)
3. వ్యతిరేక ప్రచారం వద్దు (ఇది అభ్యర్థుల కోసం)
4. పెద్దల సహకారం పొందండి (ఇది అభ్యర్థుల కోసం)
5. ప్రజలకు విశ్వాసం కలిగించడం (ఇది అభ్యర్థుల కోసం)

**1.00 :** భోజన విరామం

**2.00 :** బృంద ప్రసంగాలు

ఎన్నికలు ప్రజల కోసం - మార్పు వల్ల ప్రయోజనం పొందేవారు ఏకం కావాలి.

ఈ అంశంపై అభ్యర్థులందరు ప్రసంగించేలా బృంద ప్రసంగాలు ఏర్పాటు చేయాలి.

**2.30 :** అందరి సమావేశాలు

ప్రతిబృందం నుండి ఒక్కొక్కరితో ప్రసంగాలు

**3.00 : అంశం 12 ఎన్నికలు - తీసుకోవలసిన జాగ్రత్తలు (శిక్షకుల వివరణ)**

1. ఓటర్ల జాబితాలు
2. ఎన్నికల ఖర్చు
3. పాటించాల్సిన నియమావళి
4. అనుసరించకూడని అవినీతికర పద్ధతులు
5. ఇతరములు

**3-30 :** ప్రచారానికి నినాదాలు

మంచి నినాదాల ఎంపిక

**3-45 :** ఈ శిక్షణ తర్వాత అభ్యర్థులు చేయవలసిన పనులు

1. గ్రామంలో అన్ని తరగతులకు చెందిన వారితో బృందం ఏర్పాటు చేసుకోవాలి.

2. గ్రామంలోని మౌళిక వసతులపై, అంశాలపై సర్వే

ఉదా: మంచినీరు, మరుగుదొడ్లు, మురికికాల్వలు, చెత్తా చెదారం, ఇతరులు

3. గ్రామంలో ప్రభుత్వ సంస్థలు - అందిస్తున్న సేవలు
4. ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతున్న తీరు
5. పంచాయితీ పరిపాలన సాగుతున్న తీరు

ఈ సర్వే ఆధారంగా పంచాయితీలో వున్న వాస్తవ పరిస్థితిని అభ్యర్థులు ప్రచారంలో వినియోగించుకోవాలి. ఇలాంటి ప్రచారం ప్రజల్ని ఆకట్టుకుంటుంది. అభ్యర్థుల విజయానికి దోహదం చేస్తుంది.

**4-45 :** ముఖ్యాంశాల సమీక్ష

**5-00 :** ముగింపు